

తహసీల్దార్‌తో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కౌసర్‌మోహియుద్దీన్

మూసీ బాధితులను ఆదుకోవాలి

ఎమ్మెల్యే కౌసర్‌మోహియుద్దీన్

గోల్కొండ: మూసీ పరీవాహక ప్రాంతంలో ఇళ్లు కట్టుకున్న వారంతా నిరుపేదలే అని వారిని ఆదుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని ఎమ్మెల్యే కౌసర్‌మోహియుద్దీన్ అన్నారు. శనివారం ఆయన గోల్కొండ తహసీల్దార్ అహల్యాను కలిసి మూసీ పరీవాహక ప్రాంతంలోని ఇళ్లను మార్కింగ్ చేయడం తదితర విషయాలపై చర్చించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. జీవితాంతం కష్టపడి సంపాదించిన వారు జాగాను కొనుక్కొన్ని ఇల్లు కట్టుకున్నారన్నారు. మీ ఇళ్లు అక్రమం, కబ్జాలు అంటూ అధికారులు వాటిని కూల్చివేయడానికి సిద్ధం అవ్వడం అన్యాయం అని ఆయన అన్నారు. వారి ఇళ్లకు ప్రత్యామ్నాయం చూపకుండా కూల్చడానికి సిద్ధమవడం ఎంత వరకు న్యాయం అని ప్రశ్నించారు. కాగా ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తానని తహసీల్దార్ అన్నారు. కార్పొరేటర్ మహ్మద్‌నసీరుద్దీన్, నాయకులు హారూన్‌ఫరాన్ తదితరులున్నారు.



పట్టాలు అందజేస్తున్న తహసీల్దార్ జ్యోతి, కార్పొరేటర్ దర్శన్

బాధితులకు న్యాయం...

మూసీ పరీవాహక ప్రాంతంలో ఇళ్లు ఉన్న వారికి తాము అండగా ఉండి న్యాయం చేస్తామని ఎమ్మెల్యే కౌసర్‌మోహియుద్దీన్ అన్నారు. శనివారం ఆయన మొగల్‌కా నాలా, కార్వాన్ తదితర ప్రాంతాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా అధికారులు ఇళ్లకు మార్క్ చేసిన వారు ఆయనను కలిశారు. ఏదేమైనా మూసీ పరీవాహక ప్రాంతంలో నివసించే వారికి న్యాయం జరిగేలా చూస్తానని హామీ ఇచ్చారు.



చిన్నారెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న శేఖర్ తదితరులు

'మా ఇళ్లను కూల్చి కుటుంబాలను రోడ్డున వేయొద్దు'

లంగర్‌హౌస్: తెలంగాణ సాధించుకొని తాము రోడ్డున పడే దుస్థితులు తెచ్చుకుంటామని కలలో కూడా ఊహించలేమని సీనియర్ నాయకుడు గడ్డి చంద్రశేఖర్ అన్నారు. గడ్డి శేఖర్ ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర ప్లానింగ్ బోర్డు వైస్ చైర్మన్ చిన్నారెడ్డిని బాధితులు కలిసి వినతిపత్రం అందజేశారు. తాము ఎప్పుడూ కబ్జాలకు పాల్పడలేదని, పట్టా భూముల్లో తాము ఇళ్లు నిర్మించుకున్నామన్నారు. అసలైన కబ్జాదారులను వదిలి సుందరీకరణ అంటూ తమ కుటుంబాలను రోడ్డున పడేస్తామంటే ఊరుకునేది లేదన్నారు. మాజీ కార్పొరేటర్ ఉదయ్‌కుమార్, గోపిగౌడ్, సర్వర్, అన్వర్ ఉన్నారు.

జియాగూడ 2బీ హెచ్‌కేలో ఉద్రిక్తత..

జియాగూడ: జియాగూడలోని డబుల్‌బెడ్‌రూమ్‌లను ఇతర ప్రాంతాల వారికి కేటాయించొద్దని నిర్వాసితులు శుక్రవారం రాత్రి నిరసనకు దిగారు. ఇటీవల జుమ్మెరాత్‌బజార్, ఉప్పలమ్మ టెంపుల్, మూసీ పరీవాహక ప్రాంతాల్లో నివసిస్తున్న వారి ఇళ్లను ప్రభుత్వ సిబ్బంది ఖాళీ చేయించి ప్రత్యామ్నాయంగా 16 కుటుంబాలకు జియాగూడ 2బీహెచ్‌కే డిగ్నిటీ హౌసెస్ కాలనీలో కేటాయించారు. దీంతో 100 మందికి పైగా తమ సామగ్రితో అక్కడికి చేరుకున్నారు. డబుల్‌బెడ్‌రూమ్‌ల వాసులు వారిని అడ్డుకోవడంతో తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. ఆసిఫ్‌నగర్ తహసీల్దార్ జ్యోతి పోలీసు బందోబస్తు మధ్య సుమారు 16 మంది కుటుంబాలకు పట్టాలను అందజేశారు. అయితే స్థానిక డబుల్‌బెడ్‌రూమ్‌ల వాసులు మాత్రం స్థానికేతరులకు ఇవ్వొద్దని, జీహెచ్‌ఎంసీ క్వార్టర్స్ కూల్చివేత సమయంలో తమ కుటుంబాలకే ఇస్తామని అప్పటి ప్రభుత్వం హామీ ఇచ్చిందన్నారు. కార్పొరేటర్ బోయిని దర్శన్ మాట్లాడుతూ..జియాగూడలో నిరుపేదలు అధికంగా ఉన్నారని వారికే కేటాయించాలని కోరారు. ఈ విషయమై త్వరలో హైదరాబాద్ కలెక్టర్, జీహెచ్‌ఎంసీ కమిషనర్‌ను కలుస్తామని 2బీహెచ్‌కే డిగ్నిటీ హౌసింగ్ కాలనీ ప్రతినిధులు తెలిపారు.

కేసరినగర్‌లో టెన్షన్..టెన్షన్..

మూసీ రివర్ బెల్ట్ కిందికి వచ్చే ప్రాంతాల్లో శనివారం ఆసిఫ్‌నగర్ డిప్యూటీ తహసీల్దార్ క్రాంతి సందర్శించి స్టిక్కర్లను అట్టించారు. బస్తీవాసులు కొంతమంది అడ్డుకొంటున్నప్పటికీ మరికొంత మంది తమ ఆధార్ కార్డ్స్ ఇతర వివరాలను అధికారులకు చూపించారు. దీంతో అధికారులు వివరాలు సేకరించి కలెక్టర్‌కు పంపిస్తామన్నారు. స్థానిక కుల్సుంపురా ఇన్‌స్పెక్టర్ సునీల్ బందోబస్తు ఏర్పాటు చేశారు.



కేసరినగర్‌లో సర్వే చేసి రివర్ బెల్ట్ స్టిక్కర్లను వేస్తుండడంతో ఉద్రిక్తత

బతుకమ్మ ఘాట్‌ను సుందరీకరించాలి



దుర్గారాణి

గోల్కొండ: బతుకమ్మ పండుగను పురస్కరించుకొని కార్వాన్ కేసరి హనుమాన్ ఆలయం వద్ద ఉన్న బతుకమ్మ ఘాట్‌ను సుందరీకరించాలని కార్వాన్ హనుమాన్ స్ట్రీట్ వెల్ఫేర్ అసోసియేషన్ మహిళా కమిటీ అధ్యక్షురాలు ముత్యాల దుర్గారాణి అన్నారు. ఈ మేరకు తాము బల్దియా జోనల్ కమిషనర్‌ను కలిసి బతుకమ్మ ఘాట్ పనులు వెంటనే చేపట్టాలని కోరామన్నారు. ఆలయ పరిసరాలు చెత్తకుప్పలతో నిండిపోయి ఉన్నాయన్నారు. యుద్ధప్రతిపదికన బతుకమ్మ ఘాట్‌ను శుభ్రం చేయాలని ఆమె కోరారు.

రూ.50 లక్షల హవాలా నగదు స్వాధీనం



సుల్తాన్‌బజార్: అక్రమంగా హవాలా సొమ్మును తరలిస్తున్న ఓ వ్యక్తి వద్ద రూ.50 లక్షలను సుల్తాన్‌బజార్ పోలీసులు శుక్రవారం అర్ధరాత్రి స్వాధీనం చేసుకున్నారు. ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసచారి తెలిపిన వివరాల ప్రకారం..బేగంపేట్‌కు చెందిన అమిత్ సిర్వానీ బైక్‌పై బొగ్గులకుంట నుండి అబిడ్స్ తిలక్ రోడ్డువైపు వెళ్తున్నాడు. బొగ్గులకుంట వద్ద తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులు అమిత్‌ను ఆపి వాహనాన్ని తనిఖీ చేయగా రూ.50 లక్షల నగదు లభ్యమైంది. ఈ డబ్బు ఎక్కడిదని పోలీసులు ప్రశ్నించగా..పొంతనలేని సమాధానాలు చెప్పడంతో అనుమానం వచ్చిన పోలీసులు నగదు తాలూకు పత్రాలను చూపించాలని అడిగారు. ఎలాంటి పత్రాలు లభ్యం కాకపోవడంతో రూ.50 లక్షల నగదును స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఘనంగా భగత్‌సింగ్ జయంతి



నివాళులర్పిస్తున్న కేడీ.ధినేష్ తదితరులు

అబిడ్స్: భగత్‌సింగ్ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ఆయన విగ్రహానికి రాష్ట్ర వాణిజ్య సెల్ ఆర్గనైజింగ్ సెక్రెటరి కేడీ ధినేష్ పూలమాలలు వేసి నివాళులర్పించారు.

అక్కినేని పురస్కారాల ప్రదానం



పురస్కార గ్రహీతలతో వరప్రసాద్ గురూజీ తదితరులు

గన్‌ఫౌండ్రీ: పద్మ విభూషణ్ డాక్టర్ అక్కినేని నాగేశ్వర్‌రావు, ఘంటసాల తెలుగు ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచి ఉంటారని సంపూర్ణ తూర్పు కాశీ క్షేత్రం పీఠాధిపతి వరసిద్ధి వరప్రసాద్ గురూజీ అన్నారు. శనివారం రవీంద్రభారతిలో ఘంటసాల ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో డాక్టర్ అక్కినేని పురస్కార ప్రదానోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ రంగాల్లో సేవలందించిన కళాకారులకు అక్కినేని పురస్కారాలను అందజేశారు. అంతకు ముందు ప్రముఖ గాయకుడు టి.శరత్‌చంద్ర సారథ్యంలో నిర్వహించిన అక్కినేని-ఘంటసాల సినీ సంగీత విభావరి ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో ప్రముఖ వ్యాపార వేత్త అడుసుమల్లి జగదీష్, సరస్వతి ఉపాసకులు దైవాజ్ఞశర్మ, ఘంటసాల ఆర్ట్స్ అకాడమీ అధ్యక్షుడు పి.నాగేశ్వర్‌రావు, శృతిలయ ఆర్ట్స్ వ్యవస్థాపక కార్యదర్శి ఆమని తదితరులు పాల్గొన్నారు.

'విశ్రాంత జీవితం దైవ సన్నిధిలోనే'

గోల్కొండ: సుదీర్ఘకాలం దేవాదాయ శాఖలో ఉద్యోగం చేయడం దేవుడు ఇచ్చిన వరమని సాలర్‌జంగ్ కాలనీ తిరుపల్లిగడ్డలోని శ్రీ కోవెల రంగనాయక స్వామి ఆలయ కార్యనిర్వహణాధికారి శ్రీనివాసరావు అన్నారు. ఈ నెలాకరులో పదవీ విరమణ చేయనున్న ఆయనను ఆలయ కమిటీ మాజీ సభ్యులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన తన కుటుంబసభ్యులతో కలిసి కేక్‌కట్ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దేవాదాయ శాఖలో పని చేస్తూ ఎన్నో ఆలయాలకు కార్యనిర్వహణ అధికారిగా సేవలు అందించానన్నారు. శేషజీవితాన్ని కూడా తాను దైవ సేవలోనే గడుపుతానని పేర్కొన్నారు. అశోక్‌కుమార్, సాయిబాబాచారి, సురేష్‌చారి తదితరులు పాల్గొన్నారు.



కుటుంబ సభ్యులతో కేక్‌కట్ చేస్తున్న ఈఓ శ్రీనివాసరాజు

నృత్య గురువు రాధేశ్యామ్‌కు సత్కారం



రాధేశ్యామ్‌ను సత్కరిస్తున్న భట్టు రమేష్

నాంపల్లి: తెలుగు యూనివర్శిటీ నృత్యశాఖ, దక్షిణ ప్రాంతీయ సాంస్కృతిక కేంద్రం తంజావూరు సంస్థల సంయుక్తాధ్వర్యంలో కూచిపూడి నృత్య గురువు రాధేశ్యాం చేత కూచిపూడి నృత్యంలో సూత్రధారుని పాత్ర అనే అంశంపై ప్రదర్శనా ప్రసంగ కార్యక్రమాన్ని నిర్వహించారు. శనివారం ఎన్టీఆర్ కళా మందిరంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమానికి రిజిస్ట్రార్ ఆచార్య భట్టు రమేష్ హాజరై గురువు రాధేశ్యామ్‌ను సత్కరించి ప్రసంగించారు. ఈ కార్యక్రమానికి నృత్యశాఖ శాఖాధిపతి డాక్టర్ వనజా ఉదయ్ సమన్వయకర్తగా వ్యవహరించారు. నృత్య గురువులు ఏలేశ్వరపు చలపతి శాస్త్రి, డాక్టర్ రత్నశ్రీ, విజయ్‌పాల్, డాక్టర్ సుధాకర్ పాల్గొన్నారు.

దసరా ఉత్సవ సమితి కార్యాలయం ప్రారంభం

లంగర్‌హౌస్: దసరా ఉత్సవాలు వైభవంగా నిర్వహిస్తామని లంగర్‌హౌస్ దసరా ఉత్సవ కమిటీ అధ్యక్షుడు బోగి బాలరాజ్ అన్నారు. లంగర్‌హౌస్ బాపూఘాట్ వద్ద దసరా ఉత్సవ సమితి నూతన కార్యాలయాన్ని శుక్రవారం రాత్రి ప్రారంభించారు. ఇందులో భాగంగా సంగం రాంలీలా మైదానంలో నిర్వహించే దసరా ఉత్సవాల కార్యక్రమాలను సంగం పీఠాధిపతి రాహుల్‌దాస్ బాబా చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా జానకీ సమేత వీరవెంకట విజయరాఘవ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి కార్యక్రమాలు ప్రారంభించారు. ఈ పూజలు ప్రధాన కార్యదర్శి అనిల్, కోశాధికారి శ్రీనివాస్ నిర్వహించగా ఈ కార్యక్రమాల్లో మాజీ కార్పొరేటర్ ఉదయ్‌కుమార్, కృష్ణాయాదవ్ తదితరులు పాల్గొన్నారు.



పూజల్లో రాహుల్‌దాస్ బాబా, బాలరాజ్

ఎగ్జిబిషన్ నూతన కమిటీకి సత్కారం



అబిడ్స్: నూతనంగా ఎన్నికైన ఎగ్జిబిషన్ కమిటీ పాలకవర్గాన్ని రామాయణ మేళా చీఫ్ కన్వీనర్ గోవింద్‌రాఠి ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. ఉపాధ్యక్షుడు నీరంజన్, కార్యదర్శి సురేందర్‌రెడ్డి, కోశాధికారి ప్రభాశంకర్, సంయుక్త కార్యదర్శి మోహన్‌ను సత్కరించారు. గిరిధర్‌లాల్ దాగా, మనోజ్ జైస్వాల్ తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న గజల్ కచేరి

గన్‌ఫౌండ్రీ: హైదరాబాద్‌లోని వారసత్వ సంపదను కాపాడడానికి సాంస్కృతిక కళలను ప్రోత్సహించేందుకు జీహెచ్‌ఎంసీ పలు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహిస్తుంది. అందులో భాగంగా శనివారం ఎంజేమార్కెట్‌లో గజల్, షాయారి సాంస్కృతిక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఖైరతాబాద్ జోనల్ కమిషనర్ అనురాగ్ జయంతి మాట్లాడుతూ..నగరంలోని ప్రజలకు సాంస్కృతిక వారసత్వాన్ని పరిచయమే చేయడమే కాకుండా వారిని చైతన్యం చేయాలనే ఉద్దేశంతో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అంతకు ముందు గజల్, షాయారి కళాకారుల ప్రదర్శన ప్రేక్షకులను మంత్రముగ్దులను చేసింది. ఈ క్యాక్రమంలో డిప్యూటీ కమిషనర్ ప్రశాంతి, ఏఎంహెచ్‌ఓ భార్గవ్ నారాయణ, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



'డబుల్' ఇళ్లను స్థానికులకే కేటాయించాలి



నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు

చాంద్రాయణగుట్ట: జంగమ్మెట్ రవీంద్ర నాయక్‌నగర్‌లో నిర్మించిన డబుల్ బెడ్ రూం ఇళ్లను స్థానికులకే కేటాయించాలని సీపీఎం జంగమ్మెట్ డివిజన్ కార్యదర్శి ఎ.కృష్ణా నాయక్ డిమాండ్ చేశారు. స్థానికులకు కేటాయించడంలో జాప్యం పట్ల సీపీఎం ఆధ్వర్యంలో బండ్లగూడ తహసీల్దార్ కార్యాలయం ముందు శనివారం నిరసన తెలిపారు. గతంలో స్థలాన్ని ఇచ్చిన 72 మందికి కేటాయింపులు పోనూ, మిగిలిన 190 ఇళ్లను స్థానికంగా నిరుపేదలుగా ఉన్న ఎస్సీ, ఎస్టీ, బీసీలకు కేటాయించాలన్నారు. కాని అధికారులు మాత్రం ఈ విషయంలో ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. కిషన్, రాంకుమార్, శ్రీను, రాజేష్, మహేష్, భరత్ తదితరులు పాల్గొన్నారు.

సన్మానం

నాంపల్లి: టీపీసీసీ నూతన అధ్యక్షుడు బొమ్మ మహేష్‌కుమార్‌గౌడ్‌కు కాంగ్రెస్ యువజన నాయకులు కొలిచెలిమి సురేష్ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ మేరకు శనివారం నాంపల్లిలోని గాంధీభవన్‌లో బొమ్మ మహేష్‌కుమార్ గౌడ్‌ను కలిసి పుష్పగుచ్ఛాన్ని అందజేసి సన్మానించారు.



జేఎన్‌ఏఎఫ్‌ఏయూలో స్వచ్ఛభారత్



విజయనగర్‌కాలనీ: పరిసరాల పరిశుభ్రతతో సంపూర్ణ ఆరోగ్యవంతమైన జీవనం ఆస్వాదించవచ్చని మాసబ్‌ట్యాంక్ జేఎన్‌ఏఎఫ్ యూనివర్సిటీ ప్రొఫెసర్ సీతారామలక్ష్మి, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ మనుస్వామినాదన్ సూచించారు. యూనివర్సిటీ ఆవరణలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో స్వచ్ఛభారత్ నిర్వహించి యూనివర్సిటీలో పేరుకుపోయిన చెత్తాచెదారం, వ్యర్థాలను సేకరించి పరిసరాలను శుభ్రం చేశారు. అధికారులు ఆర్.రాధిక, సతీష్‌కుమార్, సత్యనారాయణ, ఆదిత్యమూర్తి, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు పాల్గొన్నారు.

కాశీ అన్నపూర్ణ సత్రం ఉపాధ్యక్షుడిగా శంకర్



చైర్మన్‌ను కలిసిన మల్లిపెద్ది శంకర్

అబిడ్స్: కాశీ అన్నపూర్ణ సత్రం ఉపాధ్యక్షుడిగా తెలంగాణ రాష్ట్ర అవోపా అధ్యక్షుడు మల్లిపెద్ది శంకర్ ఎంపికయ్యారు. అదేవిధంగా కార్యవర్గ సభ్యుడిగా మల్లిపెద్ది శ్రీనివాస్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా చైర్మన్ టీజీ వెంకటేష్‌ను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం మల్లిపెద్ది శంకర్, మల్లిపెద్ది శ్రీనివాస్ మాట్లాడుతూ..కాశీ అన్నపూర్ణ సత్రానికి సేవ చేసుకునే అవకాశం కలగడం ఎంతో సంతోషకరమన్నారు.

10 నుంచి ఆల్ట్రా సైక్లింగ్ రేస్



వివరాలు వెల్లడిస్తున్న నిర్వాహకులు

అఫ్జల్‌గంజ్: అక్టోబర్ 10వ తేదీ నుంచి ఆల్ట్రా సైక్లింగ్ రేస్‌ను నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు వెల్లడించారు. శ్రీనగర్ నుంచి ఇండియన్ ఆయిల్ తరఫున 2వ ఎడిషన్ రేస్‌ను ప్రారంభిస్తారు. ఈ రేస్‌ను పూర్తిచేసిన వారందరికీ వరల్డ్ ఫేమస్ ఆల్ట్రా సైక్లింగ్ రేసుకు అర్హత సాధిస్తారు. ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ లిమిటెడ్ ఈ ప్రతిష్టాత్మక ఈవెంట్‌కు టైటిల్ స్పాన్సర్‌గా వ్యవహరిస్తుంది. దేశంలోని క్రీడాభివృద్ధికి కృషి చేస్తామని వెల్లడించారు.

బీజేపీ సభ్యత్వ నమోదుకు విశేష స్పందన

యాకుత్‌పురా: బీజేపీ సభ్యత్వ నమోదుకు ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తుందని బీజేపీ హైదరాబాద్ పార్లమెంట్ జాయింట్ కన్వీనర్ కామాటీ మహేశ్వర్, ఓబీసీ మోర్చా కో ఇన్‌చార్జి రాంపురం శ్రీనివాస్ తెలిపారు. శనివారం యాకుత్‌పురా నియోజకవర్గం రెయిన్‌బజార్ డివిజన్ ఓబీసీ అధ్యక్షుడు హెచ్.రాజు దేశాయ్ ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానికులు తమ పేర్లను నమోదు చేసుకున్నారు.

ముగిసిన కబడ్డీ-ఖోఖో టోర్నీ

చాంద్రాయణగుట్ట: హైదరాబాద్ జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ 68వ మండల స్థాయి టోర్నమెంట్ విజయవంతంగా ముగిసింది. శంషీర్‌గంజ్‌లోని శారద విద్యాలయలో జరిగిన బండ్లగూడ మండల జోన్ స్థాయి సెలక్షన్స్ టోర్నమెంట్‌లో కబడ్డీ విభాగం అండర్-17 బాలికల విభాగంలో జీహెచ్ఎస్ విన్నర్‌గా నిలవగా, శారద విద్యాలయ రన్నర్‌గా, అండర్-17 బాయ్స్‌లో కేబిక్యూ బార్కాస్ విజేతగా, టీఎంఆర్ఐఈఎస్ చార్మినార్ రన్నర్‌గా నిలిచాయి. అండర్-14 గర్ల్స్ విభాగంలో విజ్ఞాన భారతి విజేతగా, ఫలక్‌నుమా టీజీఎస్‌డబ్ల్యూఆర్ రన్నర్‌గా, బాయ్స్ విభాగంలో జీహెచ్ఎస్ చాంద్రాయణగుట్ట విజేతగా, ద్వితీయ స్థానంలో జీహెచ్ఎస్ జంగమ్మెట్ టీమ్‌లు నిలిచాయి. ఇక ఖోఖో అండర్-14 బాలికల విభాగంలో ఫలక్‌నుమా టీజీఎస్‌డబ్ల్యూఆర్ ఫలక్‌నుమా విజేతగా, జీహెచ్ఎస్ పయనీర్ బజార్ ద్వితీయ స్థానంలో, అండర్-17 గర్ల్స్‌లో ఫలక్‌నుమా టీఎంఆర్ఐఈఎస్ విన్నర్‌గా, బార్కాస్ టీఎంఆర్ఐఈఎస్ ద్వితీయ స్థానంలో నిలిచింది. అండర్-14 బాయ్స్‌లో చాంద్రాయణగుట్ట టీఎంఆర్ఐఈఎస్ విన్నర్‌గా, బీసీ వెల్ఫేర్ ద్వితీయ స్థానంలో, అండర్-17 బాయ్స్‌లో బీసీ వెల్ఫేర్ ప్రథమ స్థానంలో, చార్మినార్ టీఎంఆర్ఐఈఎస్ ద్వితీయ స్థానంలో నిలిచాయి. టోర్నమెంట్ కార్యనిర్వాహక కార్యదర్శి వి.శ్రీను నాయక్ ఆధ్వర్యంలో ఈ పోటీలు విజయవంతంగా ముగిశాయి.



ట్రోఫీతో చాంద్రాయణగుట్ట జీహెచ్ఎస్ జట్టు

సిటీ సివిల్ కోర్టులో జాతీయ లోక్ అదాలత్



యాకుత్‌పురా: జాతీయ లోక్ అదాలత్ సందర్భంగా శనివారం పురానీహవేలీలోని సిటీ సివిల్ కోర్టులో చీఫ్ జడ్జి రేణుకా యారా ఆధ్వర్యంలో పలు కేసులను పరిష్కరించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు నిర్వహించిన ఈ లోక్ అదాలత్‌లో పెండింగ్‌లో ఉన్న 742 కేసులు, 1815 ప్రీ లిటిగేషన్ కేసులతో పాటు మొత్తం 2557 కేసులను పరిష్కరించి బాధితులకు రూ.44,61,67,924ల నష్టపరిహారాన్ని నిర్ణయించినట్లు ఆమె తెలిపారు. ఈ లోక్ అదాలత్‌లో అదనపు చీఫ్ జడ్జీలు డి.వి నాగేశ్వర్‌రావు, డానీ రుత్, భవానీ, సీనియర్ సివిల్ జడ్జీలు పురుషోత్తం రావు, అనిషా, జడ్జీలు, న్యాయవాదులు పాల్గొన్నారు.

బాలికలు క్రీడల్లోనూ రాణించాలి



గెలుపొందిన క్రీడాకారులతో కోచ్ అలిఖజో

గన్‌ఫౌండ్రీ: బాలికలు క్రీడల్లోనూ రాణించాలని ప్రముఖ కోచ్ అలిఖజో అన్నారు. 68వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జరుగుతున్న రంగారెడ్డి జిల్లాస్థాయి రిథమిక్, జిమ్నాస్టిక్ పోటీలు శనివారంతో ముగిశాయి. ఈ సందర్భంగా వివిధ విభాగాల్లో గెలుపొందిన క్రీడాకారులకు బహుమతులను అందజేశారు. ఈ పోటీల్లో గెలుపొందిన బాలికలు రాబోయే రోజుల్లో రాష్ట్ర జాతీయ స్థాయిల్లో రాణించాలని ఆమె ఆకాంక్షించారు.

ఉత్సవాలు శాంతియుతంగా నిర్వహించాలి

జియాగూడ: దుర్గా నవరాత్రి ఉత్సవాలను శాంతియుతంగా నిర్వహించాలని గోషామహల్ ఏసీపీ కోట్ల వెంకట్‌రెడ్డి అన్నారు. షాహినాయత్‌గంజ్ ఇన్‌స్పెక్టర్ బాలు చౌహాన్ ఆధ్వర్యంలో దుర్గా నవరాత్రి ఉత్సవాల మండప నిర్వాహకులతో సౌత్‌వెస్ట్‌జోన్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ..డీజే వల్ల ఆరోగ్య సమస్యలు ఎదుర్కొంటారన్నారు. మండప నిర్వాహకులు ఇతరులకు అవగాహన కల్పించి, వేడుకలు ప్రశాంతంగా నిర్వహించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో క్రైమ్ ఇన్‌స్పెక్టర్ శోభన్‌బాబు, ఎస్ఐలు లక్ష్మయ్య, రాజేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న గోషామహల్ ఏసీపీ వెంకట్‌రెడ్డి

మూసీ నదిని పరిరక్షించాలి

అఫ్జల్‌గంజ్: మూసీ నదిని కాలుష్యం, ఆక్రమణల నుంచి పరిరక్షించాలని ఫోరమ్ ఫర్ ఏ బెటర్ హైదరాబాద్ చైర్మన్ మణికొండ వేదకుమార్ అన్నారు. ఈ మేరకు శనివారం ఉస్మానియా ఆసుపత్రి ఆవరణలో ఉన్న అఫ్జల్ పార్క్‌లోని చింతచెట్టుపై ఎక్కి 150 మంది తమ ప్రాణాలను కాపాడుకున్న విషయాన్ని గుర్తుచేశారు. వేదకుమార్ మాట్లాడుతూ.. వరదల వల్ల ఎలాంటి ఆస్తినష్టం, ప్రాణనష్టం కలగకుండా నగర అభివృద్ధికి సమగ్ర మాస్టర్ ప్లాన్ అవసరమని, ముఖ్యంగా డ్రైనేజీపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. ఆసుపత్రి ఆర్ఎంఓలు జయకృష్ణ, కవిత తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వేదకుమార్